

# ఢిల్లీ పేలుడు నేపథ్యంలో కరీంనగర్‌లో విస్తృత తనిఖీలు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్, నవంబర్ 10 :**

ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో కారులో పేలుడు సంభవించిన ఘటన నేపథ్యంలో కరీంనగర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్, కార్గో పార్సెల్ కేంద్రం, వాహన తనిఖీలు మరియు ఇతర రద్దీ ప్రదేశాలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో బాంబు స్క్వాడ్ మరియు పోలీస్ జాగిలాల (police dogs) బృందాలు పాల్గొంటున్నాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) తెలిపారు. పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు ఎవరైనా కనిపించినట్లయితే, తక్షణమే డయల్ 100 కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670744 కు సమాచారం ఇవ్వాలని సీపీ ప్రజలను కోరారు. ప్రజలు భద్రతా చర్యలకు సహకరించాలని, అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండలం కల్లేపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మంకాళి అంతగిరి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మనోధైర్యంగా ఉండాలని వారు కోరారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రవుల సందీప్, డైరెక్టర్ మచ్చ కుమార్, పర్శ సంతోష్, గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర రవి, శ్రీహరి, చందు, రంజిత్, పవన్, శంకర్, నరేష్ తదితరులు ఉన్నారు.

# విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ఎర్రబెల్లి సంపత్ రావు
- అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన బీజేపీ నాయకులు

**శెనార్తి మీడియా, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థులు జమ్మికుంట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు జీడి మల్లేష్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ, "విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి ప్రధాన కారణం నాణ్యమైన ఆహారం అందించకపోవడమే" అని ఎర్రబెల్లి సంపత్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టే వారికి మెస్ చార్జీలు సమయానికి ఇవ్వకపోవడం వల్ల వారు నాసిరకం భోజనం వండిపెడుతున్నారని ఆరోపించారు. "విద్యాశాఖ మంత్రి లేకుండా రెండు సంవత్సరాలు గడవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని అన్నారు. వెంటనే మెస్ బిల్లులు చెల్లించి, విద్యార్థుల కు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, పట్టణ మాజీ అధ్యక్షుడు జీడి మల్లేష్, ఇల్లందకుంట మాజీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, కోరే రవీందర్, పల్లపు రవి, అప్పం మధు యాదవ్, తుడి రవిచంద్ర రెడ్డి, మోతె స్వామి, ఇటికాల సరూప, రావుల శ్రీనివాస్, మోడెం రాజు, బూరుగుపల్లి రామ్, శనిగరపు రవి, దేవులపల్లి నవీన్, కొండపర్తి ప్రవీణ్, ఉడుగుల మహేందర్, అప్పల రవీందర్, పుల్లూరి ప్రశాంత్, లాకిడి రాజు, బొంతల అమరేందర్, పసుపునూటి శివ, గట్టు రాకేష్, లొకిని శివ, మిల్కూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ రోడ్డు నిర్లక్ష్యం పై ఎమ్మెల్యేకు యువజన సంఘాల హెచ్చరిక

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల నిర్లక్ష్యంపై యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ—గతంలో రసమయి బాలకిషన్ 10 సంవత్సరాలు పాలనలో ఉండి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం ప్రారంభించామని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో పాల్గొన్న కవ్వంపెల్లి ప్రస్తుతం ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చి, ఎన్నికల సమయంలో "నన్ను గెలిపిస్తే వంద రోజుల్లో డబుల్ రోడ్డు ప్రారంభించి పూర్తి చేస్తాను" అని ప్రజలకు హామీ ఇచ్చి ఇప్పుడు ఆ మాట మరిచిపోయారని విమర్శించారు కల్వర్టులు కుంగిపోవడం వల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, రాకపోకలు స్తంభిస్తున్నాయని, వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న కవ్వంపెల్లి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారం రోజుల్లో డబుల్ రోడ్డు పనులు ప్రారంభించకపోతే యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్ని పార్టీల సహకారంతో రాజీవ్ రహదారిపై మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా అభివృద్ధి పనులు కనపడటం లేదని, ఇప్పటికైనా మండల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## అద్వితలో కార్నివల్ వేడుకలు ప్రారంభం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం బాలల ఉత్సాహం, సృజనాత్మకత, ఆనంద కాంతులతో కళకళలాడింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు రోజులపాటు జరగనున్న కార్నివల్ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న జుంబా సెషన్, బెలూన్ విడుదలలు స్వేచ్ఛా భావం, ఆనందం, ఆత్మవిశ్వాసానికి ప్రతీకలుగా నిలిచాయి. మొదటి రోజు నిర్వహించిన "గ్యాలరీ వాక్" ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్లే గ్రూప్ నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు రూపొందించిన థీమ్ ఆధారిత, ఫ్రీ స్టైల్ ఆర్ట్ వర్క్‌లు మొత్తం పాఠశాలను ఓ కళా ప్రదర్శనశాలలా మార్చాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను ఆస్వాదిస్తూ ఆ ప్రదర్శనలో సందర్శించారు. చైర్మన్ కొమరయ్య సౌగాని, డైరెక్టర్ అనుదీప్ సౌగాని, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌లు విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మక తను అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన బోధనా, అబోధనా సిబ్బందిని ప్రశంసించారు. వచ్చే రోజుల్లో సినిమా సమయం, పిక్నిక్‌లు, పాట్‌లక్‌లు, ప్రదర్శన కళల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అద్వితలో ఈ ఐదు రోజులూ పిల్లల సంతోషం, సృజనాత్మకత, సమైక్యతతో నిండిన ఆనందోత్సవాలుగా కొనసాగనున్నాయి.

# రైతులను నిండా ముంచిన పాటూరి సీడ్స్..?

**₹75 లక్షల బకాయిలు చెల్లించాని రైతుల ఆందోళన**
**కంపెనీ ఎదుట వంటావార్పు**

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

శంకరపట్నం మండలం పాటూరి సీడ్ కంపెనీ (PATURI SEED COMPANY) రైతుల చెమటను దోచుకుందని ఆరోపిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చెలరేగాయి. కంపెనీ హామీలను నమ్మి వరి విత్తన సాగు చేసిన రైతులకు చెల్లింపులు చేయకుండా వాయిదాలు వేస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు కంపెనీ కార్యాలయం ముందు బైఠాయించి, అక్కడే వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. దీంతో కంపెనీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. జనగామ, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని వందమందికి పైగా రైతులు గత రబీ సీజన్లో కంపెనీతో ఒప్పందం మేరకు 400 ఎకరాల విస్తీర్ణంలో సీడ్ వరి సాగు చేశామని తెలిపారు. పండిన ధాన్యాన్ని కంపెనీ యాజమాన్యం స్వీకరించిన తరువాత, చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకుండా రోజు – రోజుకు వాయిదాలే వేస్తోంది అని వారు ఆరోపించారు. మొత్తం రూపాయలు 75 లక్షలు (75 LAKHS)



బకాయిగా ఉన్నప్పటికీ ఇప్పటికీ చెల్లింపులపై స్పష్టత ఇవ్వలేదని రైతులు పేర్కొన్నారు. మా ధాన్యాన్ని తీసుకున్నారు... డబ్బులు మాత్రం ఇవ్వడం లేదు. పలుమార్లు వెళ్లినా ఒక్కోసారి ఓ కారణం చెబుతూ వాయిదా వేస్తున్నారు. అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నాం," అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ అలసత్వం వల్ల పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని, వేరే మార్గం లేక నిరసన చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు తెలిపారు. మాకు రావలసిన డబ్బులు పూర్తిగా చెల్లించిన తరువాతే ఇక్కడినుంచి వెళ్తాం అని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, బాధితులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**నేరప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు: సీఐ పులి వెంకట్**



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు హుజురాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పులి వెంకట్ మాట్లాడుతూ, గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారు నేరప్రవర్తనను విరమించి, సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే సహించేది లేదని, తీరు మారకపోతే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే షీటర్లపై పీడీ యాక్ట్ పెట్టడానికీ వెనుకాడమన్నారు. ప్రతి ఆరు నెలలకు చెడు ప్రవర్తన కలిగిన వారిని బైండోవర్ చేయడం వల్ల వారి కదలికలపై నిఘా ఉండుతుందని వివరించారు. బైండోవర్ కాలంలో నేరానికి పాల్పడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని తెలిపారు. ప్రతి ఒక్కరు చట్టపరమైన మార్గంలోనే ఉండి, సమాజానికి హాని కలిగించే చర్యల నుంచి దూరంగా ఉండాలని సూచించారు.

# రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**

**జమ్మికుంట, నవంబర్ 10:**

జమ్మికుంట మండల పరిధిలోని రైస్ మిల్లర్లు అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్నారని, వారి దోపిడీని వెంటనే అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు సెంటర్లను సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఒక్కో సంచికి అదనంగా రెండు నుంచి మూడు కిలోలు కాటా వేస్తూ, క్వింటాలుకు ఐదు నుంచి ఎనిమిది కిలోలు వరకు రైస్ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై రైతులు ప్రశ్నిస్తే వారిని ఎగతాళి చేస్తూ 'మీ ధాన్యం మాకొద్దు' అంటున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వాహకులను ఇబ్బందులు పెడుతున్న రైస్ మిల్లర్లపై విజిలెన్స్ శాఖ వెంటనే తనిఖీలు నిర్వహించి, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సెంటర్లకు సంబంధం లేకుండా నేరుగా తక్కువ ధరకు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గన్నీ సంచులు తిరిగి ఇవ్వకుండా కోట్లలో సొమ్ము చేసుకుంటున్న మిల్లర్లపై జిల్లా కలెక్టర్ స్పందించి రికవరీ చేయాలని కోరారు. ఐకేపీ సెంటర్లలో తార్పాలిన్లు, మంచినీరు, దారం, గన్నీ సంచులు, రవాణా వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తేమశాతంతో సంబంధం లేకుండా వరిధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, గత రబీ సీజన్ బోనస్ నిధులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఆరు నెలలు గడిచినా బోనస్ గురించి ప్రభుత్వానికి ఊసే లేదని విమర్శించారు. ఈ సీజన్‌లో సన్నవడ్లు విక్రయిస్తున్న రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న ఈ సమయంలో సహకారం ఆలస్యం చేయకూడదని



చెప్పారు.అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ఫిర్యాదులు అందజేస్తామని వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శీలం అశోక్, మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, సంపత్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.